


రోజూ శ్రీ షిర్డీబాబా సాయంకాల సమయంలో విఠోబా మందిరం అరుగుమీద కొంతమంది భక్తులతో కూర్చుంటూండేవారు. అలా ఓ గంటసేపయినా గడపందే, బాబా తన మసీదుకు వెళ్ళేవారుకాదు.

ఒకరోజు అలా కూర్చునుండగా, ఒక గొల్ల మనిషి వచ్చి, ''బాబా! నేనూ మీ భక్తురాలినే. నాకు మీలో ఆ విఠోబానే, కృష్ణభగవానుడే కనిపిస్తున్నాడు. కాబట్టి రోజూ నేను తెచ్చియిచ్చే పాలను మీరు కాదనక తాగాలి'' అంటూ వేడుకొంది.

బాబా 'సరే',అన్నారు. అది చూసి కొందరు భక్తులకు ఈర్ష్యపుట్టి- ''ఆమె చెప్పటం, మీరు నమ్మటం బావుంది బాబా! ఆమె ఏంటి? మీపట్ల భక్తి కలిగి ఉండటమేంటి? అంతా నటన'' అన్నారు వ్యంగ్యంగా.

బాబా ఏమీ మాట్లాడకుండా నవ్వి ఊరుకున్నారు. మరికొద్ది సేపట్లో విపరీతమైన గాలి, పెనుతుఫానులా వచ్చింది. దుమ్మురేగుతూ చెట్లు ఊగి ఊగి పడిపోతాయా అన్నట్లుగా వాతావరణం భయంకరంగా తయారయింది. జోరుగా వర్షం అందుకుంది వడగళ్ళతో కూడి. అకస్మాత్తుగా వాతావరణంలో వచ్చిన ఆ మార్పును చూసి అందరూ భయపడసాగారు.

''బాగా ఆకలిగా ఉంది!'' అని బాబా అన్నారు.

''ఆ.. ఉండదూ, రోజూ ఈపాటికి గిన్నెడు పాలు తాగేవారుగా మీ భక్తురాలు తెస్తే! పాపం ఈ రోజు రాదు. రాలేదులెండి'' అన్నారు ఉక్రోషంతో

---

జి. రామలక్ష్మి, హైద్రాబాద్

మిగిలినవారు.

''బిడ్డ ఆకలి తల్లికి తెలియదా? బిడ్డ ఆకలి తీర్చడం కోసం తల్లి ఎన్ని అగచాట్లయినా పడుతుంది, ఎంతటి విషమపరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కొంటుంది'' అన్నారు బాబా.

''ఆ... అలాగే చూస్తూ కూర్చోండి ఆ దొంగ భక్తురాలికోసం'' అన్నారు వాళ్ళు.

''నిజమైన భక్తికి ఏ అడ్డంకులూ ఉండవు తెలుసా! మీరే చూస్తారుగా'' అన్నారు బాబా.

వాన జోరు యింకా హెచ్చింది. అంధకారమైన చీకటి అలముకుంది.

ఆ చీకట్లో ''బాబా, బాబా, సాయిబాబా... బాబా బాబా సాయిబాబా... నాథా నాథా షిరీ నాథా'' అంటూ కదలివస్తున్న ఓ ఆకారంతోపాటు నినాదమూ వినిపించింది. మరో ఐదు నిమిషాలకు దగ్గరపడిన ఆ ఆకారం ఎవరో కాదు గొల్లమనిషి! అందరూ ఆశ్చర్యపోయారు.

''ఏవమ్మా, ఇలాంటి పరిస్థితిలో కూడా నాకోసం పాలు తెచ్చావా?'' అన్నారు ప్రేమతో బాబా.

''పరిస్థితి ఎటువంటిదైనా, నా ప్రాణాలు పోయినా కానీ, లెక్కచేస్తానా బాబా. మీ సేవలో నా ప్రాణాలు పోయినా నాకానందమే. అందుకే బయలుదేరాను. అయినా మీ నామజపం నాకు తోడుండగా నాకే భయం అనిపించలేదు బాబా'' అంది.

ఆమె నిజమైన భక్తికి ఆశ్చర్యచకితులై తమ ఈర్ష్యా, కుతంత్ర, స్వభావాలకు సిగ్గుపడ్డారు వాళ్ళంతా. బాబా ముందు తలదించుకొని ''క్షమించండి బాబా మా అజ్ఞానానికి'' అన్నారు.

